ప్రజావాణికి 72 ఫిర్యాదులు



ఫిర్యాదులు అందుకుంటున్న డీసీ మల్లయ్య, పాల్గొన్న అధికారులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం వేర్వేరుగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో సీసీ రోడ్లు వేయాలని 3 ఫిర్యాదులు, గాజులరామారం సర్కిల్‌లో మొత్తం 12 ఫిర్యాదులు అందగా, వాటిలో ఇంజనీరింగ్‌కు 4 ఫిర్యాదులు, అక్రమ నిర్మాణాలపై 2 ఫిర్యాదులు, ఆస్తిపన్నుకు సంబంధించి 3 ఫిర్యాదులు, వీధి దీపాలకు 2 ఫిర్యాదులు, పెన్షన్ కోసం ఒక్క ఫిర్యాదు వచ్చాంది. ఈ కార్యక్రమాల్లో గాజులరామారం ఉప కమిషనర్ ఎల్‌పీ. మల్లయ్య, ఏఎంసీలు ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, డీసీపీలు సాయిబాబా, సంతోష్‌కుమార్, ఏఎంవోహెచ్‌లు చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవ నారాయణ, ఈఈ కృష్ణచైతన్య, డీపీవోలు హరిప్రియ, హిమబిందు, ఎలక్ట్రికల్ డీఈ రఘుపతిరెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయ పరిధిలోని ఐదు సర్కిళ్ల నుంచి 57 ఫిర్యాదులు అందాయి. మూసాపేట సర్కిల్ నుంచి 6, కూకట్‌పల్లి నుంచి 1, కుత్బుల్లాపూర్ 3, గాజులరామారం 12, అల్వాల్ 14, జోనల్ కార్యాలయానికి సంబంధించినవి 21 చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా అందాయి. జోనల్ కార్యాలయంకు సంబంధించిన ఫిర్యాదుదారులతో జెడ్సీ అభిలాష అభినవ్ మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి నివేదికను అందజేయాలని జెడ్సీ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల అధికారులు పాల్గొన్నారు.



మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్, అధికారులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఎక్కువగా పారిశుధ్యంపై, ప్రభుత్వ పథకాలపై దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు, బీజేవైఎం కార్యకర్తలు

వర్సిటీలో గజం స్థలం కూడా వదులుకోం

- విద్యార్థులకు మద్దతు పలికిన బీజేవైఎం
- నాలుగు రోజుల అల్టిమేటం ఇచ్చిన అధ్యక్షుడు మహేందర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీ స్థలాన్ని ఇతర సంస్థలకు అప్పగించడం పట్ల కొనసాగుతున్న విద్యార్థుల నిరసనకు బీజేవైఎం మద్దతు పలికింది. యూనివర్సిటీలోని 100 ఎకరాల స్థలాన్ని హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 55ని ప్రతిపాదించిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు గత 28 రోజులుగా ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. వారి నిరసనలకు సంఘీభావంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్‌తో పాటు ఇతర కార్యకర్తలు సోమవారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ... విద్యార్థుల నిరసన కార్యక్రమాలను, ఉద్యమాన్ని అభినందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. యూనివర్సిటీలో ఒక్క ఇంచు జాగాను కూడా వదులుకోమని... బుల్డోజర్ యూనివర్సిటీలో అడుగుపెట్టాలంటే ముందు విద్యార్థుల మీద నడిపించాల్సి ఉంటుంది అన్ని హెచ్చరించారు. రక్తాన్నైనా చిందిస్తాం కానీ యూనివర్సిటీ భూములు వదులుకోమన్నారు. తెలంగాణకే తలమానికమైన ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ కేవలం విద్యార్థులకు మాత్రమే కాదు...రాష్ట్రంలోని అనేక మంది రైతులకు ఆధారంగా నూతన వంగడాలకు, నూతన వ్యవసాయ విధానాలకు ఓ ప్రధాన కేంద్రంగా ఉందని అన్నారు. అనంతరం ప్రభుత్వానికి నాలుగు రోజుల అల్టిమేటం ఇస్తున్నట్లు ప్రకటించి... జీఓ నెంబర్ 55ని రద్దు చేయకపోతే ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఈ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని మహేందర్ హెచ్చరించారు.



- త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డిని సోమవారం రాజ్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తైలవర్ణ చిత్రపటాన్ని అందజేస్తున్న విశ్వ గురువు వరల్డ్ రికార్డ్స్ సీఈఓ సత్యవోలు రాంబాబు, సలహా మండలి సభ్యులు లక్ష్మీకాంతం, కృష్ణాది శేష, డాక్టర్ ఎంఆర్ రాజు, డి. ఎల్లా సుబ్బారెడ్డి ఉన్నారు. - దుండిగల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి)

13 నుంచి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

జీడిమెట్ల, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జగద్గిరిగుట్ట లక్ష్మీవేంకటేశ్వర స్వామి 53వ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ కొలుకుల జగన్ తెలిపారు. సందర్భంగా జాతర పోస్టర్‌ను ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణు యాదవ్, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ఈఓ కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



- సూరారం మల్లారెడ్డి, నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక క్యాథెటరైజేషన్ ల్యాబొరేటరీ(క్యాథ్‌ల్యాబ్)ను సోమవారం ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్, మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, చైర్మన్ డాక్టర్ బద్రారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడి, జాతీయ ఒలింపిక్ షూటర్, అర్జున్ అవార్డు గ్రహీత (2023) ఈషాసింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. - షాపూర్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి)

ముగిసిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

తిరుమలగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ గ్లోబ్ వర్సెస్ హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్‌లు పోటీ పడ్డాయి. ఫైనల్లో హైదరాబాద్ గ్లోబ్ టీం విజయం సాధించింది. విజేతకు 50వేల ప్రైజ్ మనీ, రన్నర్ అప్‌కు 25 వేల ప్రైజ్ మనీని సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్, ప్యారసాని రామ్‌కుమార్ అందజేశారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైఖెల్ అబ్రహాంలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. గిరినగర్‌కు చెందిన వృద్ధుడు, ఎన్‌టీఆర్‌నగర్‌కు చెందిన గృహిణి అదృశ్యమైంది. పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.



పోశెటి

బాలానగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గిరినగర్‌లో నివాసముండే చందుబట్ల పోశెట్టి(63) కుమారుడు చందుబట్ల ఉమానంద్‌తో కలిసి ఉంటున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జనవరి 30న తెలవారుజామున ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. తిరిగి రాలేదు. సమీప బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు చందుబట్ల ఉమానంద్ ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌టీఆర్‌నగర్‌లో...



శిరీష

ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసముంటున్న నర్రా అశోక్, శిరీష భార్యాభర్తలు. అశోక్ ప్రైవేట్ ఉద్యోగి. శిరీష ఇంటి వద్దనే ఉంటోంది. ఈనెల 1న అశోక్ ఆఫీసులో విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. తన భార్య ఎక్కడికివెళ్లిందని ఇరుపొరుగు వారిని అడిగాడు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో అశోక్ సోమవారం బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలో ఉన్న వారిని ఎవరైనా గుర్తిస్తే 94906 17114నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

బండరాయిని ఢీకొట్టిన కారు

- నలుగురు విద్యార్థులకు గాయాలు

రాయదుర్గం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు అతి వేగంగా నడుపుతూ బండరాయిని ఢీ కొని నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గచ్చిబౌలిపోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్బీనగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు వైష్ణవి, హరిచంద్రప్రసాద్, శివ, ఆనంద్ ఆదివారం కారులో ఎల్బీనగర్ నుంచి మాదాపూర్‌లోని కేబుల్‌బ్రిడ్జిని చూసేందుకు వచారు. సాయంత్రం 4 గంటలకు తిరిగి వెళ్లే సమయంలో అలోక్ మద్యం మత్తులో కారును అతివేగంగా నడపడంతో క్వాల్కమ్ బిల్డింగ్ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న బండరాయిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. ఆనంద్, వైష్ణవికి తుంటి ప్రాంతంలో గాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిని వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ నిర్మాణానికి ప్రైవేట్ సంస్థ చేయూత

బాలానగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చరబండరాజునగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుని మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడి పోతున్నారని గత ఏడాది సెప్టెంబర్ 15న 'బండా బంజరు దొడ్డా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. కథనాన్ని చూసిన ఓ ప్రైవేట్ కంపెనీ (గ్లాండ్ ఫార్మ) సొంత నిధులతో 16 గదులతో జీ ప్లస్ వన్ భవనాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చింది. పాఠశాల భవన నిర్మాణ పనులు పూర్తయ్యే వర కు విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా, వారు చదువుకునేందుకు పక్కనే ఉన్న కమ్యూనిటీ హాల్‌లోకి మార్చారు. నాలుగు రోజుల క్రితం నిర్మాణ పనుల నిమిత్తం పాఠశాల ఆవరణలో బోరు కూడా వేశారు. చరబండరాజునగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి తెలిపారు.

కెమికల్ గోదాముల పరిశీలన



కెమికల్ గోదాంలను పరిశీలిస్తున్న అధికారులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'కాటేస్తోన్న కాలుష్యం' కథనానికి తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు కదిలారు. సోమవారం జీడిమెట్ల పారిశ్రామిక వాడ ప్రాంతంలోని గంపలబస్తీ, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో అక్రమంగా నివాసాల మధ్య నడుపుతున్న కెమికల్ గోదాంలను పీసీబీ ఈఈ రాజేందర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేశారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించి చర్యలు తీసుకుంటామని రాజేందర్ పేర్కొన్నారు.

రోడ్లపై వ్యాపారాలు చేస్తే చర్యలు : సీఐ

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పాదాచారులు, వాహన దారులకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ వెంకట్ అన్నారు. కేపీహెచ్‌బీలోని తహసీల్దార్ కార్యాలానికి ఇరువైపులా, రైతుబజార్ వరకు రోడ్డు వెంట పూలు, పండ్లు, ఇతరత్రా వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను సోమవారం సీఐ పరిశీలించారు. రోడ్లపైన ఉన్న వ్యాపారాలను తొలగించడంతో పాటు భవిష్యత్తులో రోడ్డు మీదకు వచ్చి నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుపై బైక్, కార్లు పార్క్ చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా వ్యాపారులపైనే ఉందన్నారు.

కమిటీ సభ్యులకు సన్మానం



కూకట్‌పల్లి డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీకి కమిటీగా ఎన్నికైన సభ్యులు సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎం.విఠల్, ప్రధాన కార్యదర్శి బి.విఠల్, కోశాధికారి వీరేశం, సభ్యులు ఎల్లంనాయుడు, నర్సింహులు, ఎర్రన్న, రాము, శ్రీను, కాశీనాద్, మల్లేష్, రాంచందర్ పాల్గొన్నారు. - వివేకానందనగర్‌కాలనీ,(ఆంధ్రజ్యోతి)

ప్రజల రుణం తీర్చుకోలేనిది: వివేకానంద్



కృతజ్ఞతా యాత్రలో ద్వారకానగర్ మహిళలతో ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తనను రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఎమ్మెల్యే చేపట్టిన కృతజ్ఞతా యాత్ర 20వ రోజు సోమవారం మాణిక్యానగర్, మధుసూదన్‌రెడ్డి నగర్, ద్వారకానగర్ కాలనీల్లో కొనసాగింది. మాజీ కార్పొరేటర్ కేఎం. గౌరీష్‌తో కలిసి ఎమ్మెల్యే ఆయా కాలనీల వాసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కాలనీల అధ్యక్షులు మహేష్, నాగప్ప, శ్రీనాథ్, సభ్యులు రాజేష్, మధు, నాగరాజు, శ్రీనివాస్, సాయిలు, అంజిరెడ్డి, కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, సురేందర్‌రెడ్డి, నజీర్ కాలనీల వాసులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించండి'

పేట్‌బషీరాబాద్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీపీఎం నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలను అందజేశారు.

కార్పొరేట్ బ్యాడ్మింటన్ విజేత ఇన్ఫోసిస్



ఇన్ఫోసిస్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అభిషేక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ ఐదో సీజన్‌లో ఇన్ఫోసిస్ జట్టు విజేతగా నిలిచింది. హైటెక్ సిటీలోని గేమ్ పాయింట్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్‌లో టీమ్ ఆప్టమ్‌ను ఓడించి ఇన్ఫోసిస్ జట్టు ట్రోఫీని దక్కించుకుంది. ఇన్ఫోసిస్ తరఫున పురుషుల సింగిల్స్‌లో ప్రణవ్, మహిళల సింగిల్స్‌లో రుత్విక విజేతలుగా నిలిచారు. డబుల్స్‌లో భరత్-మనోజ్ జోడీ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భరత్-మౌసమ్ జంట చాంపియన్‌గా నిలిచి, ఇన్ఫోసిస్‌కు ఓవరాల్ చాంపియన్ టైటిల్‌ను అందించారు. తెలుగు టాలాన్స్ హ్యాండ్ బాల్ జట్టు యజమాని కె.అభిషేక్ రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ బహూకరించారు.

అత్యధిక ఓటర్ల శేరిలింగంపల్లి

- ప్రస్తుతం 7,48,350మంది ఓటర్లు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు నమోదయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 6,60,000 మంది ఓటర్లు ఉండగా పార్లమెంట్ ఎన్నికల వరకు 7,50,000కు చేరుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి మొదటి సారి గుర్తింపు పొందింది. శేరిలింగంపల్లిలో 7,48,350మంది ఉండగా సుమారు 3వేల ఓట్లు నమోదు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. తుది జాబితాను ఈనెల 8న అధికారులు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఓటర్ల సంఖ్య 7,50,000పైకి చేరుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. 119 నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లు ఉన్న అతిపెద్ద నియోజకవర్గంగా శేరిలింగంపల్లి గుర్తింపు పొందింది. 3,98,460 మంది పురుషులు, 3,60,000 స్త్రీలు, 144మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తుది జాబితాను ఈనెల 8న విడుదల చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలీస్ కేంద్రాల వద్ద ఈనెల 8న జాబితాను ప్రదర్శించనున్నారు. ఓటర్లు తమ పేర్లను చేసుకోవచ్చని తెలిపారు.

శివాలయంలో పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకాలనీ మూడో రోడ్డులోని శివాలయంలో సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వామి వారి అభిషేకం చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, పాతూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఫేస్-2లో నిర్మాణం పూర్తి అయిన సీసీ రోడ్డును కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, పోశెట్టి గౌడ్, ఇంతియాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీపురంలో..



ఫతేనగర్ డివిజన్ ఇందిరాగాంధీపురంలో రూ. 30లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను డివిజన్ ఏఈ పవన్‌తో కలిసి కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఇందిరాగాంధీపురం సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. - ఫతేనగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి)

పరామర్శ

ఫతేనగర్: అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫతేనగర్ డివిజన్ మైనారిటీ విభాగం మహిళా నాయకురాలు రహీమను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పరామర్శించారు. ఎలాంటి అవసరం వచ్చినా తనకు ఫోన్ చేస్తే ఆదుకుంటామని ఆమె కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

వైజ్ఞానిక ప్రదర్శన



గౌతమీనగర్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు దాదాపు 70 నమూనాలను తయారు చేశారు. ప్రదర్శనను స్కూల్ ప్రిన్సిపాల్ టి.జాయిశ్రీ లీన్, మంజుల తదితర ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. - ఫతేనగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి)

డైరీ ఆవిష్కరణ



రిటైర్డు ఇండస్ట్రీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆదివారం బాలానగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు కె.శ్రీరామరెడ్డి, జనరల్ సెక్రెటరీ వై.మల్లారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.మానయ్య, కార్యదర్శి వి.విద్యాభూషన్ పాల్గొన్నారు. - బాలానగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి)

చెరువుల పరిరక్షణ బాధ్యత తీసుకుంటాం



స్థానికులతో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

హైదర్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చెరువుల పరిరక్షణ బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. సోమవారం ఆయన ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ(కుంట)ను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గఫూర్, డివిజన్ అధ్యక్షుడు మారేళ్ల శ్రీనివాస్, శశి, రవి, రాజా, సయ్యద్, రామచంద్ర, శ్రీను, సంగమేష్, సయ్యద్ గోవింద్, హరినాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

రాయదుర్గం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి టీఎన్‌జీఓస్ కాలనీలో సోమవారం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

నో ఎంట్రీ సమయాన్ని తీసివేయాలి

గాజులరామారం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ట్రాక్టర్, డీసీఎం, టిప్పర్ వాహనాలకు నో ఎంట్రీ సమయాన్ని అధికారులు తీసి వేయాలని ఫ్రెండ్స్ ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మహదేవపురం చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా అవసరాలకు ఉపయోగపడే ఈ వాహనాలకు హైదరాబాద్‌లోని నో ఎంట్రీ సమయంవల్ల సరైన సమయానికి మెటీరియల్స్ తీసుకెళ్లలేక పోతున్నామని, గ్రేటర్ హైదరాబాద్ డంపింగ్‌కు మెటిరియల్స్ తీసుకెళ్తున్న వాహనాలకు సీ అండ్ డీ రామ్‌కీ చార్జీలు రూ. 100 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

18న 10కే రన్

గచ్చిబౌలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఉదయం 5.30 గంటలకు ఈనెల 18న టీఎస్‌ఫిట్ నాలుగు లైఫ్ కార్పొరేట్ చాలెంజ్ పేరుతో 10కే రన్ చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈరన్‌లో పాల్గొనే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు ఓ ప్రకటనలో తెలిపారు.

యూత్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా సునీల్‌యాదవ్



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా మూసాపేటకు చెందిన జిట్టా సునీల్ యాదవ్ నియమితులయ్యారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గంలోని భాగమైన కూకట్‌పల్లి నియోజకవర్గానికి సునీల్‌యాదవ్ కోర్డినేటర్‌గా వ్యవహరించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశించింది.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

బాలానగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్క పెంటయ్య, ఆయన కుమారుడు బీఆర్ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కర్క నాగరాజు బీఆర్ఎస్ సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీ నామ చేస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామ పత్రాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు పంపినట్టు వారు చెప్పారు.

- కూకట్‌పల్లికి చెందిన సీనియర్ నాయకుడు గొట్టిముక్కల పద్మారావుతో పాటు నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన మరి కొంత మంది నేతలు సొంత గూటికి వెళ్లే యోచనలో ఉన్నట్టు చర్చ.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

అభివృద్ధికి కృషి

దుండిగల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బస్తీలు, కాలనీల అభివృద్ధికు కృషి చేస్తామని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీలోని డీ పోచంపల్లి 9వ వార్డులో నాయకులతో కలిసి గాయత్రినగర్‌లో రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, రూ.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డైనేజీ పనులకు వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, సాయిచాదవ్, భరత్‌కుమార్, మల్లేష్, సాయిబాబు, మాధవరావు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి రూ. లక్ష విరాళం

గచ్చిబౌలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లోని శ్రీవిజయదుర్గా భవానీ అమ్మవారి ఆలయం అభివృద్ధికి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ రూ.లక్ష విరాళం అందజేశారు. మసీద్‌బండలోని బీజేపీ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు గుణశేఖర్, సతీష్, అశోక్‌కు ఆయన చెక్కు అందజేశారు.

14 మంది అరెస్టు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 14 మందిని కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేపీహెచ్‌బీలోని 6వ ఫేజ్ అను రెసిడెన్స్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ. 1.56 లక్షల నగదు, 13 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.